

సోమశిలలో 68.270 టీఎంసీలు

జలాశయంలో ఆదివారానికి 68.270 టీఎంసీలు ఉన్నాయి. 23,182 క్యూసెక్కుల వరద వస్తోంది. కండలేరుకు 10,350 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,10,750
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,945
3 శాతం జీఎస్టీతో	రూ.10,243
నవర (8 గ్రా)	రూ.81,944

గరిష్టం/కనిష్టం
38.2 /29.1

వాతావరణం

జిల్లాలో సోమవారం వాతావరణం అక్కడక్కడ పాక్షికంగా మేఘావృతంగా ఉండి ఉక్కపోత అధికంగా ఉంటుంది. ఆదివారం గాలిలో తేమ 44 శాతంగా నమోదైంది.

నెల్లూరులో

చంద్రగ్రహణ దృశ్యాలు













- సాక్షి ఫొటో గ్రాఫర్, నెల్లూరు



కన్నీటి బిల్లులపై కమీషన్ ముద్ర

- ఉద్యోగి మరణించినా.. తప్పని మామూళ్ల కప్పం
- లంచమిస్తే సరి.. లేదంటే కనికరం ఉండదు
- ఉద్యోగులు బెనిఫిట్స్ జీపీఎఫ్, ఆర్జిత సెలవులకు కమీషన్
- మట్టి ఖర్చుల బిల్లులు ట్రెజరీకి పంపాలన్నా అదే పరిస్థితి
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోన్న సీనియర్ అసిస్టెంట్‌లు

మరణం ముందు అన్నీ చిన్నవే అనేది మనం నమ్మిన నిజం. కానీ జిల్లా వైద్య శాఖలో మాత్రం అవినీతి ముందు మరణమూ బలాదూరే అని నిరూపితమవుతోంది. మానవత్వం, కరుణ, దయ ఉండాల్సిన వైద్యశాఖను అవినీతి రోగం పీడిస్తోంది. ఇక్కడ జీవితం ముగిసినా, కన్నీళ్లు కారినా, మృతుడి కుటుంబం నాశనం అయినా.. మట్టి ఖర్చులకూ లంచం వసూలు చేసే వైద్యశాఖ సిబ్బంది కాఠిన్యం మానవత్వాన్ని మింగేస్తోంది. సహచరుడనే కనికరం చూపించాల్సిన తరుణంలో ఆ కుటుంబానికి బెనిఫిట్స్ అందించాలంటే ముడుపులు తప్పనిసరి కావడం వైద్యశాఖ అమానుషానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇంటి పెద్ద మరణంతో అనాథలుగా మారిన ఆ కుటుంబాలు ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తుంటే, సీనియర్ అసిస్టెంట్లు కమీషన్ లేకుండా ఫైల్ కదపకపోవడం దారుణం.

నెల్లూరు (అర్బన్): జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అవినీతికి అడ్డాగా మారిపోయింది. ఏ చిన్న ఫైలు కదలాలన్నా ముందుగా సీనియర్ అసిస్టెంట్లకు లంచం అనే కప్పం కట్టాల్సిందే. లేదంటే కాళ్లరిగేలా నెలలు, సంవత్సరాలు తిప్పుకుంటూ ఇబ్బంది పెడుతున్న పరిస్థితి తప్పడం లేదు. విధి నిర్వహణలో ఉంటూ తోటి సహచరుడు మరణించినా దయ, జాలి అని చూపరు. చివరికి మట్టి ఖర్చుల కోసం బిల్లును ట్రెజరీకి పంపాలన్నా తృణమో. ఫణమో సమర్పించుకోవాల్సిందే.డాక్టర్లకు సెలవులకు సంబంధించిన బిల్లులు పెట్టాలన్నా కమీషన్ ముట్టచెప్పాల్సిందే. రెగ్యులర్‌కు సంబంధించి ఎస్ఆర్‌లు నమోదు చేయాలన్నా మామూళ్లు ఇచ్చుకోవాల్సిందే. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో డాక్టర్లు, నర్సులు, అధికారులు, ఔట్‌సోర్సింగ్, పారిశుధ్య సిబ్బంది ఇలా సుమారు 4,000 మంది వరకు పని చేస్తున్నారు. ఎప్పుడైనా, ఎవరైనా ఏ కారణం చేతనైనా మరణించినా వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ పరంగా రావాల్సిన సదుపాయలు కల్పించడంలో వైద్యశాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చెల్లించాల్సిన బెనిఫిట్స్ అందించడంలో అడ్డంగా లంచాలు మెక్కుతున్నారు. లేదంటే చిన్న, చిన్న లోపాలు చూపి ఫైళ్లను పక్కన పడేస్తున్నారు.

డీఎంహెచ్ఓ కార్యాలయంలో నాలుగో తరగతి ఉద్యోగి డ్రైవర్‌గా పనిచేస్తున్న రసూల్ విధుల్లో ఉండగానే ఆరు నెలల క్రితం మృతి చెందాడు. ఆయనకు కుమార్తెలున్నారు. అయితే అతని డెత్ బెనిఫిట్‌కు సంబంధించిన బిల్లులు సిద్ధం చేయడంలో వైద్యశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఫలితంగా నెలలు గడుస్తున్నా... ఆ కుటుంబానికి ఎలాంటి బెనిఫిట్స్ రాలేదు. పేద కుటుంబం కావడంతో అల్లాడిపోతున్నారు. బిల్లులు త్వరగా సిద్ధం చేసి తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన సాయం అందేలా చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నా.. సంబంధిత సీనియర్ అసిస్టెంట్ ప్రతి రోజూ తిప్పుకుంటునే ఉన్నాడు. దీంతో విసిగిపోయిన కుటుంబ సభ్యులు కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల నుంచి చీవాట్లు పడటంతో ఇప్పుడు హడావుడిగా రసూల్‌కు సంబంధించిన బెనిఫిట్ బిల్లులు సిద్ధం చేశారు.



డాక్టర్లు అయినా ఎదురుచూడాల్సిందే

- జిల్లాలో 52 పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న డాక్టర్లు సెలవులకు చెందిన బిల్లులు క్లియర్ కావాలన్నా.. ఆ సీనియర్ అసిస్టెంట్ వద్దకు వెళ్లి త్వరగా చేయమని వేడుకోవాలి. సమాజంలో గౌరవంగా బతికే డాక్టర్లు సైతం ఈ–1 సీటు వద్దకెళ్లి సెలవుల మంజూరుకి సంబంధించి ఒక్కొక్క డాక్టర్ రూ.1500 చెల్లించాల్సిందే.
- వైద్యశాఖ కార్యాలయంలోనే పక్క రూంలో ఉండే ఓ గజిటెడ్ అధికారి తన రెగ్యులైజేషన్‌కు సంబంధించిన ఆదేశాలను వైద్యశాఖ నుంచి తెచ్చుకున్నారు. అయితే ఆ వివరాలను ఎస్ఆర్ (సర్వీసు రిజిస్టర్)లో ఎంటర్ చేసి ఒక కాపీ ఆ గజిటెడ్ ఉద్యోగికి ఇవ్వాలి. తక్కువ స్థాయి కలిగిన ఈ–1 సీనియర్ అసిస్టెంట్ ఆ పని కూడా చేయకుండా మామూలు కోసం ఎదురు చూస్తున్నాడని తెలుస్తోంది. ఇలా ఈ–1 సీటు మాత్రమే కాకుండా మిగతా సెక్షన్లలో కూడా సకాలంలో ఫైళ్లు క్లియర్ చేయకుండా సాటి ఉద్యోగులను తిప్పుకుంటున్నారు.

ఈ–1 సీటులోనే ఫైళ్లు పెండింగ్

డాక్టర్ల ఎస్ఆర్‌లకు సంబంధించి దాదాపు 30 ఫైళ్లు క్లియర్ చేయకుండా ఈ–1 బీరువాలో ఉండిపోయాయి. ఈ–1 చేతిలో ఉన్న 300 రోజుల ఎర్న్ లీవులకు సంబంధించిన ఫైళ్లు, జీపీఎఫ్ బిల్లులు, మట్టి ఖర్చుల బిల్లులు సకాలంలో పూర్తి చేయడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఆమ్యామ్యాలతో సీటు దక్కిందా?

ఈ–1 సీటులో పనిచేస్తున్న ఉద్యోగి గతంలో వెంకటాచలంలో సీహెచ్‌సీ (సామాజిక ఆస్పత్రి)లో పని చేశారు. అప్పట్లో ఆయన సక్రమంగా విధులు నిర్వర్తించకపోవడం, రికార్డులు ఇంటికి తీసుకుని పోవడం వంటి కారణాలతో ఆయన్ను సస్పెండ్ కూడా చేశారు. వైద్య శాఖలోకి వచ్చాక మలేరియా విభాగంలో పనిచేస్తూ టీకు కలప మాయం కావడంలో ఆయనపై విమర్శలు వచ్చాయి. రాష్ట్ర ఉన్నతాధికారులు సైతం వచ్చి విచారణ జరిపారు. ఇప్పుడు కూడా ఈ–1 సీటులో ఉన్న వ్యక్తి పట్టుమని గంట సేపు కూడా ఉండరని బాధితులు పేర్కొంటున్నారు. అలాంటి వ్యక్తికి కీలకమైన ఈ–1 సీటు బాధ్యతలు అప్పగించడం వెనుక పెద్ద ఎత్తున అధికారులకు ఆమ్యామ్యాలు అందాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గెజిటెడ్ ఆఫీసరైనా అంతే..

ముత్తుకూరు పీహెచ్‌సీలో విల్సన్ గెజిటెడ్ అధికారి. ఆయన 2023 ఏప్రిల్ నెలలో ప్రమాదానికి గురయ్యారు. తర్వాత మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు బిడ్డలున్నారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న భర్త కాలం చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న భార్య తన భర్తకు చెందిన ఆర్జిత సెలవులు, పెన్షన్, గ్రాట్యుటీ కోసం వైద్యశాఖ చుట్టూ తిరుగుతోంది. ఇలా రెండేళ్ల నాలుగు నెలల పాటు తిరిగి, తిరిగి వేసారి పోయింది. వైద్యశాఖలో ఆ బిల్లులు చేయాల్సిన ఈ–1 సీనియర్ అసిస్టెంట్ గత నాలుగు నెలలుగా తిప్పుకుంటున్నాడు. అంతకు ముందు ఆ సీట్లో ఉన్న మరో మహిళా ఉద్యోగి కూడా ఇలాగే తిప్పుకుంది. ఆ బెనిఫిట్స్ ఇవ్వాలంటూ అడిగింత ముడుపులు చెల్లిస్తేనే బిల్లులు పెడుతానంటూ ఈ–1 సీటు చూస్తున్న సీనియర్ అసిస్టెంట్ పేర్కొనడంతో విల్సన్ కుటుంబ సభ్యులు తీవ్ర మనో వేదనకు గురైంది.

- మరో బయాలజిస్ట్ ఆర్జిత సెలవులకు సంబంధించి కూడా అలాగే తిప్పుకుంటున్నారు.
- ఒక రికార్డు అసిస్టెంట్ రిటైర్డ్ అయినప్పటికీ తన 10 నెలల జీపీఎఫ్ మిస్సింగ్ క్రెడిట్స్ ఎంటర్ చేయాలని పదే పదే వేడుకుంటున్నా ఫలితం శూన్యం.
- ఉద్యోగి ఎవరైనా మృతి చెందితే మట్టి ఖర్చుల కింద ట్రెజరీ కొంత నగదు చెల్లిస్తోంది. అయితే అందుకు సంబంధించిన బిల్లు సైతం వైద్యశాఖ సిబ్బంది పంపాలి. అందుకు కూడా డబ్బులు వసూలు చేస్తున్నారని సాటి ఉద్యోగులే పేర్కొంటున్నారు.



డీఎంహెచ్‌ఓ కార్యాలయం

నేను బాధ్యతలు తీసుకున్నాక క్లియర్ చేస్తున్నా..



ఆఫీసులో పెండింగ్ ఫైల్స్ అన్నీ క్లియర్ చేస్తున్నాం. కొంత మందికి ఆలస్యం కావడానికి ఎస్ఆర్‌లోనే ఏళ్ల తరబడి తప్పులు ఉన్నాయి. ఆ తప్పులను సరి చేసి డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు పంపాం. అక్కడి నుంచి ఇక్కడకు రావడం, ఇక్కడ నుంచి సంబంధిత ఉద్యోగులు పని చేసిన పీహెచ్‌సీకి పంపడంలో కొంత సమయం గడిచి ఉండొచ్చు. ఇందులో ఎవరి లోపం లేదు. నేను బాధ్యతలు తీసుకున్నాక పెండింగ్ ఫైళ్లను వేగంగా క్లియర్ చేస్తున్నాను. విల్సన్, రసూల్ తదితరుల పెండిగ్ ఫైళ్లను రెండు రోజుల క్రితమే క్లియర్ చేశాం.– **డాక్టర్ వి.సుజాత, డీఎంహెచ్ఓ**

న్యూస్‌రీల్

పార్టీ రాష్ట్ర కార్యదర్శి నియామకం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులను నియమిస్తూ వారికి అసెంబ్లీ నియోజకవర్గాలను కేటాయిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అందులో భాగంగా కొడవలూరు ధనుంజయరెడ్డిని కావలి, ఉదయగిరి నియోజకవర్గాలకు నియమించారు. ఆయన పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ సంబంధిత రీజనల్ కో ఆర్డినేటర్లు, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులకు సహాయకారిగా వ్యవహరిస్తారని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో నియామకం

కందుకూరు: వైఎస్సార్ సీపీలో పలు అనుబంధ విభాగాల జిల్లా స్థాయి కమిటీలకు కందుకూరు నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు ఎంపికయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్ సీపీ న్యాయ విభాగ కమిటీ జిల్లా సెక్రటరీగా పీపీఏ సుబ్బరామయ్య, కార్యనిర్వాహక సభ్యుడిగా షేక్ సుల్తాన్‌బాషా, వాణిజ్య విభాగ కమిటీ జిల్లా సెక్రటరీగా వేమూరి వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక సభ్యులుగా తాళ్లూరి వెంకటేశ్వర్లు, దివ్యాంగుల విభాగ కమిటీ సెక్రటరీగా పఠాన్ అయూబ్‌ఖాన్, కార్యనిర్వాహక సభ్యులుగా మల్లెబోయిన శివకృష్ణలను నియమించారు. జిల్లా చేనేత విభాగ జిల్లా కార్యదర్శిగా కవర్తపు నవీన్, కార్యనిర్వాహక సభ్యులుగా కవర్తపు వాసుదేవరావు, జిల్లా ఇంటలెక్చువల్ కమిటీ కార్యనిర్వాహక సభ్యులుగా చెక్కా శింగయ్య, జిల్లా అంగన్‌వాడీ విభాగ సెక్రటరీగా షేక్ జమీనా నియమితులయ్యారు.

పెంచలకోన క్షేత్రంలో ముగిసిన ఉత్సవాలు



శేషవాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి శేష వాహనంపై మాడవీధుల్లో ఊరేగారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను శేష వాహనంపై కొలువుదీర్చి క్షేత్రోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి వారి అలంకార మండపంలో ఉత్సవ విగ్రహాలకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. శాంతి హోమం, పూర్ణాహుతి , నివేదన, మహాకుంభప్రోక్షణ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి మాట్లాడుతూ మహాపూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగిశాయన్నారు.

చంద్రబాబు అధికారంలోకి వస్తే రైతుకు కష్టాలే



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి
- 9న 'అన్నదాత పోరు' పోస్టర్ ఆవిష్కరణ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రైతులకు కష్టాలు తప్పడం లేదన్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు అతివృష్టి, అనావృష్టితో రైతులు తీవ్రంగా నష్టపోయారని, గిట్టుబాటు ధరల్లేక అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. ఇప్పుడు అధికారంలో వచ్చినా రైతులకు యూరియా అందించకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలించడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విత్తనాలు దొరక్క, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక పంటలు ఎగుమతి లేకపోవడంతో రైతులు నిరాశ నిస్పృహలతో ఉన్నారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతున్నలకు బాసటగా ఈ నెల 9వ తేదీ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న 'అన్నదాత పోరు' కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆదివారం నెల్లూరు రాంజీనగర్ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాలు రైతులకు వెన్నుదన్నుగా ఎన్నో సంస్కరణలు తీసుకు వచ్చిన ఘనత వారికి దక్కుతుందన్నారు. రాజశేఖరరెడ్డి చేపట్టి జలయజ్ఞం, ఉచిత విద్యుత్ అమలు, జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన రైతుభరోసా కేంద్రాలతో రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా నిర్వహించుకున్నారని తెలిపారు. రైతు భరోసాగా ఏడాది రైతులకు రూ.13,500, సీజన్‌కు ముందే ఎరువులు, విత్తనాలు సమృద్ధిగా అందించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. పండిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో రైతులు జీవితాల్లో కొత్త వెలుగులు నిండాయన్నారు. వ్యవసాయం లాభసాటిగా ఉంటేనే రైతు సంతోషంగా ఉంటూ అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి తొలి ఏడాది నుంచి ప్రతి రైతు ఎకరాకు రూ.20 వేల నష్టపోతున్నారన్నారు. కూటమి విధానాల మూలంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటూ వ్యవసాయ రంగంలో నష్టాలు చవిచూడాల్సి వస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ నేత లు, కార్యకర్తలు, అన్నదాతలు జయప్రదం చేయాలని కోరారు.

పామాయిల్ దొంగ టీడీపీ నేతేనా!

- ఆ పార్టీ కీలక నేత రాజేంద్ర అరెస్ట్‌తో వాస్తవాలు బట్టబయలు
- రాజకీయ ఒత్తిళ్లతో పోలీసులు మౌనం.. తప్పించుకుని తిరుగుతున్న నిందితుడు



ఎమ్మెల్యే సోమిరెడ్డితో రాజేంద్ర



వెంకటాచలం పంచాయతీ వడ్డిపాళెంలో గతేడాది వినాయకచవితి ఉత్సవాల్లో జీవిత ఖైదీ శ్రీకాంత్‌తో కలిసి పాల్గొన్న రాజేంద్ర

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: పంటపాళెంలోని ఫ్యాక్టరీల నుంచి తరలించే పామాయిల్ ట్యాంకర్లల్లో ఆయిల్‌ను మరో వాహనంలోకి మార్చేసి ఆ వాహనానికి ప్రమాదంగా చిత్రీకరించి ఇటు సొమ్ము చేసుకుంటూ అటు ఇన్స్యూరెన్స్ పొందుతున్న గజదొంగ వెంకటాచలం వడ్డిపాళేనికి చెందిన టీడీపీ నేత రాజేంద్రే అని శనివారం పోలీసుల అరెస్ట్‌తో స్పష్టమైంది. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డితో రాజేంద్రకు సన్నిహిత సంబంధాలే ఉన్నాయి. టీడీపీ నేరచరితులను పెంచి పోషిస్తోందనే దానికి రాజేంద్ర ఉదంతమే ఉదాహరణగా నిలుస్తోంది. నాలుగు నెలల క్రితం జరిగిన ఈ కేసుకు సంబంధించి పాత్రధారి, సూత్రధారిని తప్పించిన పోలీసులు మిగతా వ్యక్తులను అరెస్ట్ చూపారనే ఆరోపణలు వచ్చాయి. అయితే ఎట్టకేలకు ముత్తుకూరు పోలీసులు రాజకీయ ఒత్తిళ్లను పక్కన బెట్టి టీడీపీ నేతగా చెలామణి అవుతున్న రాజేంద్రను అరెస్ట్ చేయడంతో సర్వేపల్లి నియోజకవర్గంలో చర్చానీయాంశమైంది.

ఆయిల్ కాజేసీ.. ప్రమాదంగా చిత్రీకరించి..

సర్వేపల్లి నియోజకవర్గ కేంద్రం వెంకటాచలం వడ్డిపాళెం పంచాయతీకి చెందిన రాజేంద్ర ఏప్రిల్‌లో ముత్తుకూరు మండలం పంటపాళెం ఫ్యాక్టరీ నుంచి సుమారు 24 టన్నుల పామాయిలతో బయటకు వచ్చిన ట్యాంకర్‌ను డ్రైవర్, మరి కొందరితో కలిసి వెంకటాచలం మండలం నాయుడుపాళెం సమీపంలోని అడవిలోకి తీసుకెళ్లి మరొక ట్యాంకర్‌లోకి పామాయిల్ మార్చేశారు. ఆ పామాయిల్‌ను పిడుగురాళ్లకు తరలించి, అక్కడి ఓ వ్యాపారికి అమ్మకాలు చేసి సొమ్మును వాటాలుగా పంచుకున్నారు. అయితే ఖాళీ ట్యాంకర్‌ను మనుబోలు మండలం కొమ్మలపూడి సమీపంలోని పంట కాలువలో జేసీబీతో పడేసి ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. ఈ కేసులో పాత్రధారి, సూత్రధారి టీడీపీ నేత రాజేంద్రేనని ప్రచారం జరిగింది. అయితే రాజకీయ ఒత్తిళ్లతో పోలీసులు రాజేంద్రను తప్పించి ఆరుగురిని అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో తాజాగా ముత్తుకూరు పోలీసులు ఈ కేసులో ప్రధాన నిందితుడు, టీడీపీ నేత రాజేంద్రను శనివారం అరెస్ట్ చేశారు.

శ్రీకాంత్‌తోనూ రాజేంద్రకు సంబంధాలు

హత్య కేసులో జీవిత ఖైదీగా ఉన్న శ్రీకాంత్‌తో టీడీపీ నేత రాజేంద్రకు సత్సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఆరోగ్య సమస్యల పేరుతో జైలు నుంచి తిరుపతి రుయా ఆస్పత్రికి వెళ్లే ప్రతిసారి వెంకటాచలం పంచాయతీ వడ్డిపాళెంలో రాజేంద్రను కలిసి వెళ్తుండేవాడని ప్రచారం జరుగుతోంది. గతేడాది వడ్డిపాళెంలో జరిగిన వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా రాజేంద్ర ఆహ్వానించడంతో శ్రీకాంత్ వడ్డిపాళెం వచ్చి వెళ్లినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అదే విధంగా మరో రౌడీషీటర్ జగదీష్‌తోనూ రాజేంద్రకు మంచి పరిచయాలు ఉన్నాయని బయటపడటంతో పోలీసులు వీటన్నింటిపై విచారణ జరుపుతున్నారు.

చివరి శ్వాస.. ఆశ

- దాతృత్వం.. నిలిపేను సుదీప్తి ప్రాణం
- గుండె, ఊపిరితిత్తులు మార్పిడి శస్త్రచికిత్స అవసరం
- రూ.70 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు స్పష్టం
- అనారోగ్యంలోనూ ఎంబీఏ వరకు చదివిన పేదింటి విద్యా కుసుమం

పసిప్రాయం నుంచే ప్రాణాపాయం. గుండె, ఊపిరితిత్తుల వ్యాధులతో సతమతమైనా క్షణక్షణం.. శ్వాస కోసమే యుద్ధం చేస్తూ ఎదిగింది. చదువుతో తన జీవితానికి వెలుగుల ఆశలు రాసుకుంది. శరీరం శల్యమవుతున్నా.. మొక్కవోని లక్ష్యంతో ఉన్నత విద్యలో జయకేతనం ఎగురవేసిన ధైర్యవంతురాలు సుదీప్తి. కానీ ఇప్పుడు ఆమె జీవితం చివరి ఊపిరి దూరంలో నిలిచిపోయింది. గుండె, ఊపిరితిత్తుల మార్పిడి శస్త్ర చికిత్స తప్ప మరో మార్గం లేదని వైద్యులు స్పష్టం చేశారు. కుమార్తె ఊపిరి నిలిపేందుకు చేసిన రుణాలతో నలిగిన తల్లిదండ్రుల బాధను దాచుకుని, కన్నీళ్లను మింగుకుని జీవచ్ఛంలా బతుకుతూ ఇప్పుడు ప్రాణం పణంగా పెట్టుకుంది. వైద్యానికి అవసరమైన రూ.లక్షలు సుదూర స్వప్నంగా మారింది. ఆపదలో ఉన్న తల్లిదండ్రుల మనోవేదన ఒక్కటే.. మనసున్న హృదయాలు కదలకపోతే తన కుమార్తె చివరి శ్వాస ఆగిపోతుందని, దాతృత్వం తోడ్పాటే జీవం పోస్తుందని ఆ తల్లిదండ్రుల చివరి ఆశ.

కోవూరు: మండలంలోని పడుగుపాడుకు చెందిన కొప్పల సుధాకర్, రాధిక దంపతుల పెద్ద కుమార్తె సుదీప్తి. బిడ్డ చివరి శ్వాసను చివరి వరకు నిలబెట్టుకునేందుకు ఆ తల్లిదండ్రులకు ఆర్థిక స్థోమత సరిపోగా, దాతృత్వం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రాణాపాయం తప్పించాలంటే గుండె, ఊపిరితిత్తులు మార్పిడి శస్త్రచికిత్స తప్పదని వైద్యులు స్పష్టం చేశారు. చెన్నైలోని నిపుణులు సుదీప్తి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి.. తక్షణమే ఈ శస్త్రచికిత్స జరగాలని, దానికి సుమారు రూ.70 లక్షల ఖర్చవుతుందని వెల్లడించారు. కానీ సుదీప్తిది పేద కుటుంబం కావడంతో అంత పెద్ద మొత్తాన్ని సమకూర్చే స్థోమత లేక తీవ్ర ఆందోళనలో ఉంది. పాప ప్రాణం కాపాడేందుకు ఆప్తులు, బంధువులు, గ్రామస్తులు వీలైనంతగా తోడ్పడుతున్నా.. అవసరమైన నిధులు సమకూర్చుకోవడం అది జీవిత స్వప్నంగా మిగిలిపోతుందని కుమిలికుమిలిపోతున్నారు. మనసున్న దాతలు ముందుకొచ్చి తమ బిడ్డ ప్రాణాన్ని కాపాడాలని కోరుతూ ఆ కుటుంబం కొంగుచాచి చివరి ఆశగా ఎదురు చూస్తోంది.

కన్నీటిలో తడిసిన కలల గాథ

సుదీప్తి చిన్ననాటి నుంచే గుండె, ఊపిరితిత్తులు సమస్యలతో బాధపడుతోంది. 2016–18 మధ్య కాలంలోనే వైద్యులు అనేక పరీక్షలు నిర్వహించి మార్పిడి శస్త్ర చికిత్స తప్పదంటూ స్పష్టం చేశారు.



సుదీప్తితో తల్లి రాధిక

ఆ సమయంలో అనేక ఆస్పత్రులు చుట్టూ తిరిగినా ఉపయోగం లేకపోయింది. అప్పటి నుంచి సుదీప్తికి అనారోగ్యమే నిత్యసహచరిగా మారింది. రోజు రోజుకు అంతకంతకు పెరుగుతున్న ఆరోగ్య సమస్యలను సైతం లెక్క చేయకుండా చదువుపై ఆసక్తిని వదలని సుదీప్తి, తన కష్టాన్ని, నొప్పిని దాచుకుంటూ విద్యలో రాణించింది. మొదట 10వ తరగతి పూర్తి చేసి, తర్వాత ఉన్నత చదువులు కొనసాగిస్తూ చివరకు ఎంబీఏ పూర్తి చేసింది. ప్రతి అడుగులో ఆమెను శరీర బాధ, ఆర్థిక ఇబ్బందులు అడ్డుకున్నా.. ధైర్యాన్ని మాత్రం వదల్లేదు. కుమార్తె ప్రాణాల కోసం తల్లిదండ్రులు అప్పులు చేసి రూ.లక్షల ఖర్చు చేశారు. చెన్నై కంచికామకోటి ఆస్పత్రుల్లో, తర్వాత ఎంజీఎం వైద్యుల వద్ద అన్ని రకాల పరీక్షలు చేశారు. తాజాగా గుండె, ఊపిరితిత్తులు మార్పిడి శస్త్రచికిత్స తప్ప వేరే మార్గం లేదని వైద్యులు తేల్చి చెప్పారు.

రూ.70 లక్షలు.. దాతల కోసం ఎదురుచూపులు

ఈ శస్త్రచికిత్స కోసం సుమారు రూ. 70 లక్షల ఖర్చవుతుంది. ఇప్పటికే వైద్యానికి రూ.లక్షల్లో అప్పులు చేసినా ఆ తల్లిదండ్రులకు అంత మొత్తం సమకూర్చుకోవడం సాధ్యం కాని పని. ఓ పక్క బిడ్డ ప్రాణాలు చివరి దశలో ఉన్నాయి. దాతృత్వం చివరి ఆశగా తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. మనస్సున్న దాతలు సాయం అందించేందుకు సుదీప్తి తల్లి రాధికను 9848923921 నంబరులో సంప్రదించవచ్చు. బ్యాంక్ ద్వారా సాయం చేయాలనుకుంటే కెనరా బ్యాంక్, కోవూరు బ్రాంచ్‌లోని ఖాతా నంబర్ : 110055071311, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0803332.

క్లుప్తంగా

'నాపై హత్యాయత్నం చేసింది'

• ఐఎఫ్ఎస్ అధికారి శ్రీనివాసులురెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

నెల్లూరురూరల్: నన్ను అడ్డుతొలగించుకోవాలని భార్య రేణుక హత్యాయత్నం చేసిందని ఐఎఫ్ఎస్ అధికారి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నెల్లూరు నగరంలోని బీవీనగర్‌లో ఉన్న తన నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రేణుక మరొకరితో సన్నిహితంగా ఉంటున్నట్లు ప్రత్యక్షంగా చూసిన వారు చెప్పారన్నారు. మెసేజ్‌లు, ఫోన్‌పే వివరాలున్నాయన్నారు. కోర్టులో కేసు నడుస్తోందన్నారు. రేణుక మీడియా సమావేశంలో తప్పుడు వివరాలు వెల్లడించినట్లు తెలిపారు. రేణుక మా అమ్మ, తనపై ఇనుపరాడ్డుతో దాడి చేయడం సీసీ పుటేజీలో నమోదైందన్నారు.

రైల్లో ప్రయాణిస్తూ..

• కింద పడి వ్యక్తి మృతి

మనుబోలు: రైల్లో ప్రయాణిస్తూ కింద పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు.. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో గుర్తుతెలియని వ్యక్తి రైల్లో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు గూడూరు – మనుబోలు రైల్వేస్టేషన్ల మధ్య డౌన్‌లైన్‌లో 138/6 – 8 కిలోమీటర్ వద్ద కింద పడి తీవ్రంగా గాయపడి చనిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు. మృతుడి 40 – 45 సంవత్సరాల మధ్య ఉండొచ్చని చెబుతున్నారు. బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్, మెరూన్ కలర్ ఫుల్ హ్యాండ్ షర్ట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి మందలించాడని..

• యువతి ఆత్మహత్య

నెల్లూరు సిటీ: కళాశాలకు వెళ్లలేదని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన కుమార్తె గడ్డిమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ గుంజి వేణు కథనం మేరకు.. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని కోడూరుపాడు గ్రామంలోని కల్తీకాలనీలో పట్టపు రవి నివాసముంటున్నాడు. అతను డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రవి కుమార్తె నవ్య (21) నెల్లూరు నగరంలోని వివేకానంద కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతోంది. ఈనెల 5వ తేదీన నవ్య కళాశాలకు వెళ్లకపోవడంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన యువతి అదేరోజు మధ్యాహ్నం గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు నవ్యను నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయింది. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నాయకా.. ఇదేం చెత్త పని?

• బరితెగించి గ్రావెల్ అక్రమ తవ్వకాలు
• గుంతల్ని చెత్త, వ్యర్థాలతో పూడ్చేందుకు ఆపసోపాలు
• గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నా పట్టించుకోని కూటమి నేతలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సర్వేపల్లి నియోజకవర్గంలో కూటమి నేతలు ఇష్టారాజ్యంగా సహజ వనరులను దోపిడీ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. 14 నెలల పాలనలో ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో రూ.కోట్లు విలువ చేసే గ్రావెల్ తవ్వకాలు చేపట్టి, పరిశ్రమలకు, నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్ పరిధిలోని లేఅవుట్లకు తరలించేశారు. గ్రావెల్ గుంతలను పూడ్చేందుకు చెత్త, వ్యర్థాలను తరలిస్తుండటం స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వెంకటాచలం మండలం సర్వేపల్లి గ్రామ పరిధిలో 20 ఎకరాల్లో రూ.కోట్ల విలువైన గ్రావెల్‌ను అక్రమంగా తవ్వి జేబులు నింపుకొన్నారు. తవ్వకాల కారణంగా ఆ భూముల్లో భారీ గుంతలు ఏర్పడ్డాయి. అవి ఇలానే కనిపిస్తే గ్రావెల్ దోపిడీ బట్టబయలై, కూటమి ప్రభుత్వం మారితే ఇబ్బందులు పడతామనే భయం నేతలకు పట్టుకుంది. దీంతో గ్రావెల్ గుంతల్ని పూడ్చేందుకు ఆపసోపాలు పడుతున్నారు. నెల్లూరు నగర పరిధిలో నుంచి చెత్త, వ్యర్థాలను టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ గుంతలు కనిపించకుండా చేస్తున్నారు.

అవినీతిని కప్పేయడం సాధ్యమేనా?

సర్వేపల్లి గ్రామంలో కూటమి నేతలు చేసిన గ్రావెల్ అవినీతి అంతా ఇంతా కాదు. 20 ఎకరాల్లో 10 నుంచి 15 అడుగుల లోతులో గ్రావెల్‌ను టిప్పర్లతో రేయింబవళ్లు తరలించి సొమ్ము చేసుకున్నారు. ఈ భూముల్లో నెలల తరబడి వేల సంఖ్యలో టిప్పర్లలో గ్రావెల్ తరలివెళ్లినా ఏ ఒక్క అధికారి కూడా అటువైపు కన్నెత్తి చూడలేదు. నేడు గుంతల్ని వ్యర్థాలతో కప్పేసే ప్రయత్నాలు చేస్తుండటంపై సర్వేపల్లికి చెందిన కూటమి నేతలే బహిరంగంగా విమర్శిస్తున్నారు. టన్నుల్లో చెత్త తీసుకొచ్చి పూడ్చినా, చేసిన అవినీతిని ప్రజలు ఎలా మర్చిపోతారని ప్రశ్నిస్తున్నారు. రూ.కోట్ల అవినీతిని చెత్తతో కప్పేయడం సాధ్యమవుతుందా అని మండిపడుతున్నారు.



గ్రావెల్ గుంతలో వేసిన చెత్త, వ్యర్థాలు

ఆందోళన చెందుతూ..

గ్రావెల్ గుంతలను పూడ్చేందుకు వ్యర్థాలు, చెత్తను తీసుకొచ్చి తరలిస్తుండటంతో తాగునీరు కలుషితం అవుతుందేమోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గ్రావెల్ గుంతలు 15 అడుగుల లోతులో ఉండటంతో వాటిలో వ్యర్థాల్ని నింపుతున్నారు. వర్షాకాలంలో గుంతల్లోని వ్యర్థాలతో కూడిన నీరు గ్రామ సమీపంలోని బావుల్లోని ఇంకి కలుషిత నీరు సరఫరా అవుతుందేమోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం దుర్వాసన మాత్రమే వస్తోంది. వానలు కురిసినప్పుడు తాగునీరు కలుషితమైతే ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవినీతి పాపం బట్టబయలు కాకుండా ఉండేందుకు ఇలాంటి చెత్త పనికి పూనుకుంటారా అని గ్రామస్తులు మండిపడుతున్నారు.



చెత్త తరలిస్తున్న టిప్పర్

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన వారిని ఏపీ వైఎస్సార్ టీఏ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సత్కరించారు. అవార్డులు అందుకున్న వైఎస్సార్ టీఏ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎస్.శ్రీలత, సీనియర్ సభ్యుడు కేవీ రమణారెడ్డి, ట్రెజరర్ యానాదిరెడ్డిని ఆదివారం సత్కరించి అభినందనలు తెలిపారు.



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పర్వతరెడ్డి

ఘటోత్సవ వైభవం



భక్తజన సందోహం మధ్య సాగుతున్న ఘటోత్సవం

• ప్రారంభమైన వెంకటగిరి జాతర

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి గ్రామదేవత పోలేరమ్మ జన జాతర అంగరంగ వైభవంగా ఆదివారం ప్రారంభమైంది. ఘటోత్సవంతో అమ్మవారి సంబరం అంబరాన్నంటింది. ఘటోత్సవం చూసేందుకు తరలివచ్చిన అశేష భక్త జనంతో వెంకటగిరి పట్టణ పురవీధులు కిక్కిరిశాయి. పోలేరమ్మ తల్లీ చల్లగా చూడాలమ్మా అంటూ వేడుకున్నారు. ఘటం కుండలకు అధిక సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించి ఆధ్యాత్మికతను చాటుకున్నారు. ఘటం కుండలతో ఇంట్లో పూజలు చేస్తే సాక్షాత్తు పోలేరమ్మ తల్లే కొలువై ఉంటుందన్న విశ్వాసం. దీంతో అమ్మవారి ఘటోత్సవానికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులను తీర్చుకున్నారు.



వెంకటేశ్వర ప్యాలెస్ వద్ద వాహనం నుంచి ఘటం కుండలను దించుతున్న దృశ్యం

భక్తుల ఆగ్రహంతో..

రాష్ట్ర పండగైన వెంకటగిరి పోలేరమ్మ తల్లి జాతర సందర్భంగా ఘటోత్సవంలో సంప్రదాయాలకు విరుద్ధంగా కొత్త విధానాలకు తెరలేపడంతో భక్తుల ఆగ్రహించారు. దీంతో పాత పద్ధతిలోనే కొనసాగించారు. వివరాలిలా.. ఘటోత్సవంలో సంప్రదాయాలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరించడం భక్తుల మనోభావాలు దెబ్బతీశాయి. వాస్తవానికి ఘటోత్సవం జీనుగుల వారి వీధిలోని మెట్టినింటి మండపం వద్ద నుంచి రాజా ప్యాలెస్‌కు నడక మార్గంలో ఘటం కుండలను ఊరేగించడం ఆనవాయితీ. ఈ ఏడాది పక్కన పెట్టి గతంలో ఎప్పుడూ లేని విధంగా ఘటం కుండలను ఊరేగించేందుకు ప్రత్యేక వాహనంలో జీనుగుల వారి వీధిలోని అమ్మ మెట్టి నింటి మండపం వద్ద ఎక్కించేశారు. ఘటం కుండలు నడక మార్గం గుండా రాకపోవడంతో స్థానికంగా ఉన్న పట్టణ ప్రముఖులు ఆగ్రహించారు. దీంతో పోలీసు బందోబస్తు మధ్య యథావిధిగా కాలి నడక ద్వారా సాగించారు.

యువత కేరింతలు

జాతరలో తొలి ఘట్టం ఘటోత్సవం ఆరంభమైన నేపథ్యంలో పట్టణంలోని యువత, మహిళలు పెద్ద సంఖ్యలో జీనుగులవారి వీధిలోని అమ్మవారి మెట్టినింటి మండపం వద్దకు చేరుకున్నారు. మండపంలో అమ్మవారి ఘటము (కుండ)లకు స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఆలయ అధికారుల సమక్షంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి ఘటం కదిలి ఆంజనేయస్వామి దేవస్థానం, బజారు వీధి, పోలేరమ్మ తల్లి దేవస్థానం, రాజా ప్యాలెస్ మీదుగా సాగింది. యువతతోపాటు మహిళలు కూడా పెద్ద సంఖ్యలో హాజరై కుండలను తాకేందుకు పోటీ పడ్డారు. రాజా ప్యాలెస్‌లో వెనుక భవనం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ యువత అధిక సంఖ్యలో చేరుకోవడంతో బారికేడ్లను ఏర్పాటు చేసి పోలీసులు ఎక్కడికక్కడ కట్టడి చేశారు. అమ్మవారికి బలి ఇచ్చే దున్నపోతును ఘటంకు ముందుగా నడిపించుకుంటూ తీసుకొచ్చి పూజలు చేశారు. ఐదురోజులపాటు గురువారం వరకు ఈ ఘటం పట్టణంలోని అన్ని వీధుల్లోనూ తిరుగుతుంది. ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డి, సీఐ ఏవీ రమణ పర్యవేక్షణతో కార్యక్రమాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించారు.

ఏపీఆర్ఎస్ఏ ఎన్నికలు ఏకగ్రీవం

• అల్లంపాటికే రెండో దఫా అధ్యక్ష పదవి

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ విభాగాల్లో ప్రతిష్టాత్మకమైన ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) జిల్లా శాఖ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఆదివారం నెల్లూరు కలెక్టరేట్ ఆవరణలోని ఏపీఆర్ఎస్ఏ కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి అశోక్‌రెడ్డి ఎన్నికల అధికారిగా, శివప్రసాద్ సహాయ అధికారిగా, గోపీనాథ్‌రెడ్డి పరిశీలకులుగా ఎన్నికలు నిర్వహించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. 2 గంటల వరకు స్క్రూటినీ నిర్వహించారు. 24 పదవులకు 24 మంది మాత్రమే నామినేషన్లు వేయడం, పోటీలో ఎవరూ లేకపోవడంతో వారందరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించిన ఎన్నికల అధికారులు ఉత్తర్వులు అందజేశారు.

కార్యవర్గం ఇలా..

ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడిగా రెండో దఫా కూడా నుడా సెక్రటరీగా పని చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ అల్లంపాటి పెంచలరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కలెక్టరేట్‌లో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న యెడ్ల నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా చేజర్ల తహసీల్దార్ మురళి, ఉపాధ్యక్షులుగా కోవూరు సీఎస్ డీటీ బాల కోటమ్మ, వరికుంటపాడు తహసీల్దార్ హేమంత్‌కుమార్, వింజమూరు సీఎస్ డీటీ శ్రీనివాసులు, మర్రిపాడు తహసీల్దార్ అనిల్‌కుమార్ యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నెల్లూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీగా నెల్లూరు అర్బన్ ఈడీటీ ఆనందరావు, జాయింట్ సెక్రటరీలుగా మనుబోలు తహసీల్దార్ రమాదేవి, ఇందుకూరుపేట డీటీ శ్రీకాంత్‌రెడ్డి, టీపీ గూడూరు ఆర్ఎస్ డీటీ అశోక్‌వర్ధన్, కలెక్టరేట్ ఓఎస్ నుంచి అలరేష్, కోశాధికారిగా వెంకటాచలం ఆర్ఎస్ డీటీ సతీష్ కుమార్, ఈసీ మెంబర్లుగా యూత్ వెల్ఫేర్ డీటీ గయాజ్ అహ్మద్, కందుకూరు సీఎస్ డీటీ చెంచురామయ్య, కావలి ఆర్ఎస్ డీటీ నరసారెడ్డి, డీఎస్ఓ ఆఫీసు నుంచి సందానీ, కందుకూరు సీనియర్ అసిస్టెంట్ కోటయ్య, అనంతసాగరం డీటీ శేషయ్య, కొడవలూరు సీనియర్ అసిస్టెంట్ మస్తాన్‌బాబు, స్టేట్ కౌన్సిల్ మెంబర్లుగా మనుబోలు డీటీ ప్రదీప్, దుత్తలూరు డీటీ లక్ష్మి, నెల్లూరు రూరల్ నుంచి కృష్ణప్రసాద్ వ్యవహరిస్తారు. వారి చేత ఎన్నికల అధికారులు ప్రమాణం చేయించారు.



ధ్రువీకరణపత్రం అందుకుంటున్న అల్లంపాటి



నూతన కార్యవర్గం

పోరాటం చేస్తాం

ఈ సందర్భంగా అల్లంపాటి పెంచలరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామన్నారు. ఈ ఏకగ్రీవ ఎన్నికలు రెవెన్యూ ఉద్యోగుల ఐక్యతను చాటాయన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బకాయిలు, డీఏ, పీఆర్సీ, ఇతర సమస్యలపై రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. రెండో దఫా అధ్యక్షుడిగా ఎన్నికయ్యేందుకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ప్రాంతాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్, జూనియర్ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.120
లేయర్	రూ.123
బ్రాయిలర్ చికెన్:	రూ.220
స్కిన్‌లెస్ చికెన్:	రూ.242
లేయర్ చికెన్:	రూ.210

అధ్వానంగా గురుకులాలు

అధికారుల తనిఖీల్లో వెలుగులోకి..

• దారుణంగా పారిశుధ్యం
• తక్కువ మొత్తంలో చికెన్ తెచ్చిన వైనం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వంలో గురుకులాలు అధ్వానంగా తయారయ్యాయి. పేద పిల్లలుండే చోట్ల పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. సాక్షాత్తు అధికారుల తనిఖీల్లో అనేక విషయాలు వెలుగు చూశాయి. నెల్లూరులోని పొదలకూరు రోడ్డులో ఉన్న గిరిజన బాలుర, బాలికల పాఠశాలలను ఆదివారం జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి బి.శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాటిని నిర్వహిస్తున్న తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాలుర గురుకులంలో..

ఇక్కడంతా అపరిశుభ్రంగా ఉండటం, ప్రిన్సిపల్ దేవసహాయం ఉదయం 11 గంటలకు సైతం రాలేదు. దీంతో ఆయన్ను పిలిపించారు. ఇంతలో పాఠశాలను సందర్శిస్తే వంట గది ముందు శనివారం నాటి మిగిలిన ఆహార పదార్థాలున్నాయి. మరుగుదొడ్ల వద్ద మురుగునీరు ఉంది. పారిశుధ్యం అధ్వానంగా ఉండటంతో ప్రిన్సిపల్‌ను తీవ్రస్థాయిలో మందలించారు. కాసేపటికి చికెన్‌ను తీసుకొచ్చారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా పది కేజీలు అవసరం. అయితే చిన్న కవర్‌లో ఉండటంతో ఇది పది కేజీలా అని అధికారి ప్రశ్నించారు. అందుకు ప్రిన్సిపల్ సంబంధం లేని సమాధానం చెప్పారు. పారిశుధ్యంపై తగిన చర్యలు తీసుకోవాలని శ్రీనివాసులు ఆదేశించారు. డ్యూటీ టీచర్ రాకపోవడంతో పిల్లలు ఇష్టమొచ్చినట్లు ఆడుకోవడం కూడా సరికాదని తీవ్ర స్థాయిలో హెచ్చరించి పలు సూచనలు చేశారు.



అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు



పరిశీలిస్తున్న అధికారులు

బాలికల గురుకులంలో..

గిరిజన బాలికల గురుకులంలో కూడా పరిస్థితి అధ్వానంగా ఉంది. అపరిశుభ్రంగా ఉండటం, వంట గదిలో వృద్ధురాలు కూరగాయలు కోయడాన్ని అధికారి చూసి డ్యూటీ టీచర్‌ను ప్రశ్నించారు. అయితే ఆ టీచర్‌కు అధికారి తెలియకపోవడంతో ఏదో సమాధానాలు చెప్పింది. అనంతరం ఆయన సంక్షేమ శాఖాధికారి అని తెలుసుకుంది. వంట చేసే ఆమె రాకుండా అమ్మను పంపించిందని జవాబిచ్చింది. ఈలోపు అక్కడున్న విద్యార్థినులతో సంక్షేమాధికారి మాట్లాడారు. వారికి ప్రాథమిక అంశాలు కూడా తెలియదని గుర్తించారు. ఐటీడీఏ అంటే ఏమిటి?, అది ఎలా పనిచేస్తుంది?, ఎలా చదువుకోవాలనే అంశాలపై శ్రీనివాసులు అవగాహన కల్పించారు. రెండు గురుకులాల నిర్వాహణపై పలు సూచనలు ఇచ్చారు. సంబంధిత సిబ్బందికి మెమోలు జారీ చేస్తామన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి


నెల్లూరు(వీఆర్సీసెంటర్): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో ఓ వృద్ధుడు మృతిచెందిన ఆదివారం రాత్రి జరిగింది. రైల్వే ఎస్సై హరిచందన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు నగరంలోని నెల్లూరు సౌత్ రైల్వే స్టేషన్ వద్ద గుర్తుతెలియని వృద్ధుడు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొట్టింది. దీంతో ఆయన తీవ్రగాయాలై చనిపోయాడు. వయసు 65 నుంచి 70 సంవత్సరాల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. ఎరుపు రంగు హాఫ్ హ్యాండ్ టీ షర్ట్, గ్రే కలర్ షార్ట్ ధరించి ఉన్నాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించినట్లు రైల్వే ఎస్సై హరిచందన తెలిపారు.

కండలేరులో 41.650 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 41.650 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 10,100 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 900, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.40
సన్నవి	: రూ.25
పండ్లు	: రూ.15





హాయిగా ఉంది

ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. జీవాలు కూడా అంతే. ఇందుకూరుపేట మండలంలో ఓ రైతు పొలానికి నీరు వదలిన సమయంలో బాతులు సేద తీరుతుండగా తీసిన చిత్రం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు